# మన'వే'మన పద్యాలు

**ఆ. వె. ఆత్మబుద్ధివలన అఖిలంబు తానయ్యె**
**జీవబుద్ధివలన జీవుడయ్యె**
**మోహబుద్ధివలన ముదితలపై దృష్టి**
**విశ్వదాభిరామ వినురవేమ!**

**అర్థములు** : ఆత్మబుద్ధి = తాను ఆత్మస్వరూపుడను అనే సత్యమును తెలుసుకొనుట.
అఖిలంబు = సర్వమూ.

**తాత్పర్యము** : తాను ఆత్మస్వరూపుడను అని తెలుసుకున్న వ్యక్తి సర్వమూ తానౌను. అంతా తనది, తానే అంతా అన్న సత్యము నిర్దుష్టముగా తెలుస్తుంది. తాను జీవుడను అని, ఈ వస్తువు నాది, ఆ వస్తువు నాది, ఇది నేను చేస్తున్నాను, అది నేను చేసాను అని తలచేవాడు జీవుడుగా కష్టసుఖాల వలయములో కొట్టుకుంటూ ఉంటాడు. అరిషడ్వర్గాలలో ఒకటైన మోహమును కలిగిన వ్యక్తి, మోహచింతలతో, ముదితలపై దృష్టిని నిలిపి అధోగతి పాలగుతున్నాడని భావం.

**ఆ. వె. తిరుమలకును బోవ దురక దాసరికాడు**
**కాశి కేగ బంది గజము గాదు**
**కుక్క సింగమగునె గోదావరికి బోవ**
**విశ్వదాభిరామ వినురవేమ!**

**అర్థములు** : దాసరి = వైష్ణవభక్తుడు.
గజము = ఏనుగు.

**తాత్పర్యము**: తిరుమల దర్శించినంత మాత్రముచేత ఒక మహమ్మదీయుడు విష్ణుభక్తుడై పోవడు. కాశికి పోయినంతమాత్రమున పంది ఏనుగుగా మారిపోదు. గోదావరికి పోయి స్నానమాడినంత మాత్రముచేత కుక్క సింహము కాదు కదా! ఎవరి జన్మలు వారివి. ఎవరి స్వభావములు వారివి. ఏవో ప్రక్రియలు చేసినంత మాత్రముచేత అవి మారిపోవని అర్థం.

*(ఇందులో కొంత భాగము స్వామి చిదాత్మానందగారి 'వేమన పద్యములు - అంతరార్థము' ప్రవచనములలో ఒంట పట్టించుకున్న సారాంశము. పూజ్య శ్రీ స్వామి చిదాత్మానంద గారికి ధన్యవాదములతో...)*

*ఒక పూలతోట అందముగా విరబూస్తూ ఉండాలంటే తోటమాలి ప్రతి మొక్కను ఎంతో శ్రద్ధతో సాకాలి. అలాగే మనమూ చక్కగా రాణించాలంటే ఆ జగన్నాధుని కృప మన్నపై ప్రసరించాలి.*